క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను, మూడు ఖాళీ ట్రాక్టర్లను బుధవారం సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు కాళంగి నది వద్ద దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు.సీఐ మాట్లాడుతూ, కాళంగినదిలో ఇసుక రీచ్ లేదని, నది నుంచి ఇసుకను తరలించటం నేరమన్నారు. ట్రాక్టర్ల యాజమానులు ఇసుకను ఇతర మండలాలకు తరలించరాదని, మండల ప్రజల అవసరాలకు మాత్రమే వాడుకోవాలని స్పష్టం చేశారు. కొందరు ఇసుకను అక్రమంగా తరలించి వ్యాపారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'అమర'లో అధునాతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం



రక్తదానం చేస్తున్న అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని

రేణిగుంట: మండలంలో కరకంబాడి సమీపంలోని అమర ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ విభాగాన్ని బుధవారం ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని ప్రారంభించారు. తొలుత ఆమె రక్తదానం చేసి మాట్లాడారు. కొత్త బ్లడ్ బ్యాంక్‌లో అధునాతన సాంకేతికతతో కూడిన రక్త సేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్ నిల్వ సౌకర్యాలున్నాయన్నారు. బ్లడ్ బ్యాంక్ ప్రత్యేకతలను వివరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకే కాకుండా ఎవరైనా రక్త సంబంధిత ఉత్పత్తులు కావాలనుకునేవారంతా ఇక్కడ పొందవచ్చన్నారు. ఈ నూతన రక్త కేంద్రం రోగులకు 24 గంటలూ తమ సేవలను అందిస్తుందని, రక్తదాతలు పెద్దఎత్తున ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని, బ్లడ్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, ఆస్పత్రి సీఈఓ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉడాన్'



వివిధ వేషధారణలో చిన్నారులు

శ్రీకాళహస్తి: పట్టణంలో శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం ఉడాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలువురు సమాజ సేవకులు, వివిధ వేషధారణలో అలరించారు. ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే వివిధ వృత్తులు, సామాజిక సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఇన్‌చార్జ్ వాసంతి, ఉపాధ్యాయులు తనూశ్రీ, శైలజ, లీలమ్మ, అనూష పాల్గొన్నారు.

కల్కి భవనం కూల్చివేతకు డిమాండ్



మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి కల్చరల్ : వరదయ్యపాళెంలో పేదల భూములు ఆక్రమించి నిర్మించిన కల్కి ఆశ్రమ భవనం కూల్చివేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మా ట్లాడారు. 20 ఏళ్లుగా కల్కి ఆక్రమణలపై ఫిర్యా దులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే కల్కి ఆశ్రమం తొలగించి సదరు భూమిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో మునిచంద్రశేఖర్, రాజేశ్వరి, అనసూయమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్‌తో లక్ష్య సాధన

తిరుపతి సిటీ: విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు లైఫ్ స్కిల్స్‌పై దృష్టి సారించి వాటిని పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని వీసీ ప్రొఫెసర్ వి.ఉమ అన్నారు. మహిళా వర్సిటీ సావేరి అతిథిగృహంలో నూతన విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఉమ విద్యార్థినులకు మార్గదర్శనం చేశారు. ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ రిలేషన్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, క్రియేటివిటీ, కోపింగ్ విత్ స్ట్రెస్ అండ్ ఎమోషన్ వంటి వాటిలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. రిజిస్ట్రార్ రజిని, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సువర్ణలత దేవి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ జై కాత్యాయని, కొత్తగా అడ్మిషన్లు పొందిన సుమారు 970మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టి సారించాలని వీసీ ప్రొఫెసర్ వి.ఉమ పిలుపునిచ్చారు. మహిళా వర్సిటీ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం హాకతాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.

పైరుకు చేటు..రైతుకు పోటు

పంటలకు హానిచేసే పురుగు మందుల విక్రయాలపై నిషేధం ఉన్నా సత్యవేడు నియోజకవర్గంలో కొందరు వ్యాపారులు యథేచ్ఛగా విక్రయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. లైసెన్సులు లేకపోయినా అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు.

- జోరుగా నిషేధిత పురుగు మందుల విక్రయాలు
- బిల్లులు ఇవ్వకుండా మోసం
- ఎరువులు సైతం అధిక ధరలు
- పట్టించుకోని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు



వరదయ్యపాళెంలోని పురుగు మందుల దుకాణం

వరదయ్యపాళెం: ప్రమాణాలు పాటించకుండా కొన్ని కంపెనీలు మందులను తయారుచేసి ఎలాంటి ముద్రలూ లేకుండా వాటిని దుకాణాలకు సరఫరా చేస్తున్నాయి. వీటిని సత్యవేడు నియోజకవర్గ కేంద్రంతోపాటు వరదయ్యపాళెం, కేవీబీపురం, నాగలాపురం, పిచ్చాటూరు, బీఎన్‌కండ్రిగ, నారాయణవనం మండలాలకు చెందిన వ్యవసాయ డీలర్లు తమ దుకాణాలు, గోడౌన్లలో భారీ మొత్తంలో నిల్వ చేసుకుని రైతులకు అంటగడుతున్నారు. ప్రస్తుతం వరి పైరులో దోమ కాటు నివారణకు తప్పనిసరిగా పురుగు మందును పిచికారీ చేయాల్సి ఉంది. ఇదే అదునుగా వ్యాపారులు నిషేధిత మందులను రైతులకు అంటగట్టి భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపారులకు రూ. 200 నుం,ఇ రూ. 300లకు వచ్చే మందులను రూ.వెయ్యికి పైగా విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రూ. లక్షల వ్యాపారం చేస్తే వ్యాపారులకు సింగపూర్, బ్యాంకాక్, మలేషియా ట్రిప్పులు ఇస్తామంటూ మందుల కంపెనీలు వల వేస్తున్న సందర్భాలు అనేకం. దుకాణల యజమానుల నుంచి వ్యవసాయాధికారులు లబ్ధి పొందుతూ నిషేధిత పురుగు మందుల విక్రయాలకు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా ఉన్నతాధికారులు వస్తున్న సమయంలో కిందిస్థాయి అధికారులే వ్యాపారులకు సమాచారం ఇచ్చి జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

గత ప్రభుత్వ పాలనలో రూ. 267కే యూరియా బస్తా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో మాత్రం యూరియా బస్తాను రూ. 267కే విక్రయించారు. ఫాస్ఫేట్ ఎరువులు కూడా ఎమ్మార్పీకే విక్రయించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో నామమాత్రంగా స్టాకు ఉంచి ఎమ్మార్పీకి విక్రయిస్తున్నారు.

వేర్వేరుగా రేట్లు

ఒక్క వరదయ్యపాళెం మండలంలోనే ఎరువుల ధరలు వేర్వేరుగా ఉన్నాయి. యూరియా బస్తాపై ఎమ్మార్పీ రూ. 267 ఉండగా వరదయ్యపాళెం, చిన్న పాండూరులో రూ. 300లకు విక్రయిస్తున్నారు. అంతేకాక ఫాస్ఫేట్ ఎరువు బస్తాకు రూ. 30 నుంచి రూ. 50 వరకు అదనంగా విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పురుగు మందులు కూడా వరదయ్యపాళెంలో ఓ రేటు, చిన్న పాండూరులో మరో రేటుతో దోచేస్తున్నారు. దుకాణాల వద్ద ధరల పట్టిక పెట్టిన పాపానపోవడం లేదు.

ఆ ఏడు మండలాల్లో కోట్లలో వ్యాపారం

సత్యవేడు నియోజకవర్గంలో ప్రస్తుత రబీ సీజన్‌లో 14వేల హెక్టార్లకు పైగా వరి సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ సత్యవేడు డివిజన్ పరిధిలో 24 ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. వీటిలో వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాలు ఉన్నాయి. అత్యధికంగా వరదయ్యపాళెం మండలంలో 10 దుకాణాలు ఉన్నాయి. ప్రతి ఏటా పురుగు మందులు, ఎరువులు విక్రయాలకు సంబంధించి డివిజన్ పరిధిలో రూ. 30 కోట్లకు పైగా వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం. రైతులకు మందులపై అవగాహన లేకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టమొచ్చినట్లు రేట్లకు అంటగడుతున్నారు.



లైసెన్సు లేకుండా పురుగు మందులు విక్రయిస్తున్న ఎల్లమ్మ ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

ఈ చిత్రంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తున్న ఎరువులు, పురుగు మందుల దుకాణం వరదయ్యపాళెంలోనిది. ఈ దుకాణంలో కొంతకాలంగా లైసెన్సు లేకుండా విచ్చలవిడిగా పురుగు మందుల విక్రయాలు జరిగాయి. వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడంతో సమాచారం అందుకున్న తిరుపతి విజిలెన్స్ అధికారులు ఇటీవల ఆకస్మిక దాడి చేశారు. రూ. 2.50లక్షల విలువ చేసే నిషేధిత పురుగు మందులను సీజ్ చేశారు. సత్యవేడు డివిజన్ పరిధిలో 24 ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఉన్నాయి.

బిల్లుల ఊసే లేదు



ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు సంబంధించి రైతులకు డీలర్లు బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు అడిగితే దురుసుగా మాట్లాడుతున్నారు. మనిషిని బట్టి ఎరువులు, పురుగు మందుల రేటు చెబుతున్నారు. మండలంలోని దుకాణాల వద్ద ఎక్కడా ధరల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలను వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

-భాస్కర్ రెడ్డి, రైతు, పెద్ద పాండూరు

చౌక ధరలకు తమిళనాడులో పురుగు మందులు



కూతవేటు దూరంలో ఉన్న తమిళనాడులో చౌక ధరలకే పురుగు మందులు లభిస్తున్నాయి. సమీపంలోని తమిళనాడు ఆరంబాకంలో ఒకే కంపెనీకి చెందిన పురుగు మందు లీటరు రూ. 500కు విక్రయిస్తుండగా, వరదయ్యపాళెంలో అదే మందు రూ. 1000, చిన్న పాండూరులో రూ. 1200లకు విక్రయిస్తున్నారు. వరదయ్యపాళెం మండలంలో అధిక ధరలకు విక్రయించడమే కాకుండా నకిలీ మందులను కూడా రైతులకు అంటగట్టి డీలర్లు దోపిడీ చేస్తున్నారు.

-రవి, రైతు, వెంగారెడ్డికండ్రిగ

సమాచారం లేదు



నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత పురుగు మందులను విక్రయిస్తున్నట్టితే కేసులు నమోదు చేస్తాం. ధరల తేడాల గురించి విచారణ చేస్తాం. రైతు సేవా కేంద్రాల్లోనే ఎమ్మార్పీకే ఎరువులు విక్రయిస్తున్నాం. రైతులందరూ స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేసుకోండి. అధిక ధరల విషయమై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-జె.సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్

నైట్, డేఅవుట్ అలవెన్సులు ఇవ్వాలి

సత్యవేడు: ప్రభుత్వం నిలుపుదల చేసిన నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు వెంటనే మంజూరు చేయాలని సత్యవేడు ఆర్టీసీ డిపో సెక్రటరీ ఆర్ జయకుమార్ కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్యవేడు గ్యారేజ్ వద్ద ఆ యూనియన్ కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలసి ధర్నా చేశారు. డిపో సెక్రటరీ మాట్లాడుతూ, 12వ పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ సిబ్బందిపై స్ప్రింగ్ డ్యామేజ్, టైర్ డ్యామేజ్, టిమ్ డ్యామేజ్‌లపై రికవరీలు చేయడం ఆపాలని కోరారు. కారుణ్య నియామకాలకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. ర్యక్రమంలో యూనియన్ నాయకులు బికే. రామయ్య, జిఆర్ రవి, సి.చంద్ర , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడారు. భారత రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. లైంగిక దాడులను ఎదుర్కోవడం, బాల్య వివాహాలను రూపుమాపడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు, సంస్థ సభ్యులు ప్రభాకర్, జయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హరిత, మంజుల, గిరిజనుల నాయకుడు చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విక్రయానికి టీటీడీ డైరీలు, క్యాలెండర్లు

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 2025 సంవత్సరం టీటీడీ డైరీలు, క్యాలెండర్లు, పంచాగం క్యాలెండర్లు గురువారం నుంచి విక్రయించనున్నామని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

శాస్త్రోక్తం.. ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఇక్కడ రోజూ ఆకాశదీపాన్ని సాంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఉయ్యాల మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

సత్యవేడు: బాల్య వివాహాలు చేస్తే పలు అనర్థాలకు దారి తీస్తాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు ఎస్.వి జయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ, బాల్యవివాహాలు చేయడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రం పరిధిలోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు దృష్టికి వస్తే సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలసి అడ్డుకోవాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ క్రేంద్రాల్లో ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన వైద్యం అందించాలన్నారు. కాన్పులు వైద్యశాలలోనే జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కేంద్రాలకు బకెట్లు, రిజిస్టర్లు, గ్యాస్‌లైటర్, చాక్‌పీసుల బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఆర్.దేవకుమారి, సూపర్‌వైజర్లు ఎస్.బాజావతి, ఎం. జ్యోతి, సి.శిల్ప, కే.యమున, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● లక్ష బిల్వార్చన.. కుంకుమార్చన



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించి గణపతి పూజ చేశారు. అనంతరం వేదపండితులు, రుత్వికులు ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు బిల్వార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఆలయ అధికారులు, పలువురు ప్రముఖులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి

'రాసాని' నవలల ఆవిష్కరణ

తిరుపతి సిటీ : ఎస్వీయూ సెనెట్ హాల్‌లో డాక్టర్ పత్తిపాటి వివేక్ అధ్యక్షతన రాసాని నవలలను ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్య అతిథి రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ రచయిత రాసాని తెలుగు సాహిత్యంలో అరుదైన అంశాల్ని కథలుగా, నవలలుగా, నాటకాలుగా మలిచారని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు యువ శ్రీ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంతో విభిన్న శైలితో రాసిన నవల రక్తచందనం అని వెల్లడించారు. అనంతరం కపిరి, రక్తచందనం నవలలను ఆవిష్కరించారు. మేడిపల్లి రవికుమార్, కొత్వాలు అమరేంద్ర, తలారి నాదముని రెడ్డి, రచయితలు బాలాజీ, కృష్ణస్వామి రాజు, మౌని, మిమిక్రీ విజయకుమార్, వి.షణ్ముగం, విశ్వనాథం,ఆకాశవాణి డైరెక్టర్ కృష్ణమోహన్, విశ్రాంత డీఎస్పీ నంజుండప్ప, రాజు పాల్గొన్నారు.

పనివేళల పెంపుపై టీచర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల పనివేళల నిర్ణయంపై ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెండరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటాద్రి డిమాండ్ చేశారు. పట్టణంలోని సరస్వతిబాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయానికి ముందుగా టీచర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉన్నత పాఠశాలలను నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం సరి కాదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బాలికలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. వారు తిరిగి సాయంత్రం ఇళ్లకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసహరించాలన్నారు. కార్యక్రమలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు గోపాల్, హేమకుమార్, టీచర్లు పాల్గొన్నారు.

విజ్ఞాన వీచికలు గ్రంథాలయాలు

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
- విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు



రేణిగుంట: విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న గ్రంథాలయాధికారిణి

రేణిగుంట: గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట గ్రంథాలయాధికారిణి శ్రీముఖి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. శ్రీముఖి మాట్లాడారు. రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయడం ఒక వ్యాపకంగా మలచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, రమ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు బుధవారం ముగిశాయి. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఎంఈవో బాలయ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాలతో ప్రపంచమేమిటో చదవవచ్చని, అలాగే ఒక లక్ష్యం నిర్దేశించుకుని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి లావణ్య, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు బుధవారం ముగిశాయి. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ బాబయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివి జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ హరి, ఉపాధ్యాయులు ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: పుస్తక పఠనం విద్యార్థి దశ నుంచే అలవరచుకోవాలని ఎంఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు.. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక లైబ్రరీలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ మాట్లాడారు.పాఠ్యపుస్తకాలతో పాటు దినపత్రికలు, కథల పుస్తకాలను చదవడాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. వారోత్సవాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖన, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జీవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ, లైబ్రేరియన్ తదితరులు



నాగలాపురం: బహుమతులు ఇస్తున్న ఎంఈఓ బాబయ్య



నారాయణనం: విజేతలైన విద్యార్థులతో ఎంఈఓ తదితరులు